క్లుప్తంగా

విద్యార్థులకు వైద్యపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

మేదరమెట్ల: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్‌లో 400 మంది విద్యార్థులకు మేదరమెట్ల యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలని, ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

గొల్లపాలెంలో నేత్రదానం



దాత సుశీలమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన వెనిగండ్ల సుశీలమ్మ (90) శుక్రవారం మృతి చెందడంతో ఆమె నేత్రాలను వారి బంధువులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దానం చేసేందుకు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. కార్యక్రమంలో వారి కుమారులు వెనిగండ్ల హనుమంతరావు,వెనిగండ్ల వెంకట్రావు, మనుమడు వెనిగండ్ల చంద్రశేఖర్‌రావు, వెనిగండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ షేక్ రఫి, కోశాధికారి చుండి సాంబశివరావులు ఇంకొల్లు రోటరీ క్లబ్ సభ్యులు దాత కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో క్లబ్ సభ్యులు

వేటపాలెం: పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలని రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు సైకిళ్లను సద్వినియోగంచేసుకొని సమయపాలన పాటించి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. క్లబ్ ద్వారా విద్యాభివృద్ధికి కృషిచేస్తామని క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లక్ష్మణస్వామి, మాజీ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు, కొత్త శ్రీనివాసరావు, కారంచేటి శివరామకృష్ణ, పద్మనాభుని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రావెల్, మెటల్ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

యద్దనపూడి: స్థానికి మండల కేంద్రం యద్దనపూడిలోని వెంకటేశ్వరస్వామి గుడి వద్ద నుండి గన్నవరం రోడ్డులోని అడ్డరోడ్డు వరకు రూ.25 లక్షలతో రోడ్డు నిర్మాణం చేసేందుకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.



జనావాసాల ముందు చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు



ఇరుకు రోడ్డులో మాంసం, కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారులు

అంతా మా ఇష్టం!

- మార్కెట్ కట్టింది ఒకచోట-వ్యాపారాలు చేసేది మరోచోట
- జనావాసాల మధ్య చేపలు, మాంసం, కూరగాయ అమ్మకాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

చీరాల రూరల్:

ప్రజల అవసరార్థం అధికారులు మార్కెట్ కట్టిస్తే అక్కడ వ్యాపారాలు సాగించకుండా మరో చోట సాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు వ్యాపారులు. పేరాలలోని జక్కావారివీధిలో ప్రజల అవసరార్థం మున్సిపల్ అధికారులు మాంసం, చేపలు, కూరగాయలు అమ్మకాలు చేసుకునేందుకు ఎంతో సువిశాలమైన స్థలంలో ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించినప్పటికీ వ్యాపారులు వాటిని విస్మరించి జనావాసాల మధ్యే తమ వ్యాపారాలు సాగిస్తూ ట్రాఫిక్‌కు పరోక్షంగా ఇబ్బందులు కల్పించడమే కాకుండా జనావాసాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తు పరిసరాలను నీచు కంపు కొంపుకొట్టిస్తున్నారు. అదేమని స్థానికులు ప్రశ్నిస్తే మార్కెట్లో మాకు వ్యాపారాలు సాగడంలేదంటూ అడిగిన వారిని దబాయిస్తున్నారు. వ్యాపారులకు అవగాహన కల్పించి వారిని మార్కెట్లోకి తరలించాల్సిన మున్సిపల్, పోలీసు అధికారులు వారిపైపు కన్నెత్తి కూడా చూడడం లేదంటే వారు ఏస్థాయిలో అధికారులను మేనేజ్ చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

వివరాల్లోకి వెళ్తే..

పేరాలలోని జక్కావారివీధిలో సుమారు 20 సెంట్లకుపైగా ఉన్న మున్సిపల్ స్థలంలో అప్పటి ఆర్థిక మంత్రి కొణిజేటి రోశయ్య హయాంలో ముఖ్యమంత్రి హామీ నిధులు రూ.5 లక్షల వ్యయంతో ప్రజారోగ్య, పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో పేరాల కూరగాయలు, చేపల మార్కెట్‌ను నిర్మించారు. మాంసం, చేపలు, కూరగాయలు విక్రయాలకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పించారు. అప్పటికే పేరాల మసీదు సెంటర్లో చేపలు, మాంసం, కూరగాయలు విక్రస్తున్న వ్యాపారులు తమ వ్యాపారాలను యథేచ్ఛగా జనాలకు, వాహనదారులకు ఆటంకం కలిగిస్తు వ్యాపారాలు జోరుగా సాగిస్తున్నారు. ఈ వ్యాపారులందరిని నూతనంగా నిర్మించిన మార్కెట్ సముదాయంలోకి వ్యాపారులను అధికారులు తరలించారు. కొంత కాలం వ్యాపారులు బాగానే క్రయ విక్రయాలు జరిపారు. స్థానిక ప్రజలు, వాహనదారులు తమ కష్టాలు తీరిపోయాయని ఊపిరి పీల్చుకున్నారు. అయితే వ్యాపారులు మాత్రం కొనుగోలుదారులు మార్కెట్‌కు సరిగా రావడంలేదనే సాకుతో తిరిగి తమ స్థావరాలను యథాస్థితిలోకి (పేరాల మసీదు సెంటర్) మార్చారు. మరలా అప్పటి నుంచి స్థానికులకు, వాహనదారులకు కష్టాలు మొదలయ్యాయి.



మాంసం, చేపల విక్రయాల కోసం మున్సిపల్ అధికారులు నిర్మించిన షెడ్డు

మార్కెట్ పరిధిలో అనేక ప్రాంతాలు..

ఈ మార్కెట్ పరిధిలో మున్సిపాలిటీలోని పేరాల మసీదు సెంటర్, జక్కావారి వీధి, శాంతినగర్, పేరాల రెడ్డిపాలెం, శ్రీనివాసనగర్, ఆనంద్‌పేట, శృంగారపేట, గాంధీనగర్, ఉజిలిపేట, పాలేటి నగర్, హరిప్రసాద్ నగర్, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, రామనగర్ ప్రజలు నివాసముంటారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఈ మార్కెట్ ఎంతో దగ్గరగా ఉంటుంది. దానికి తోడు చీరాల నుంచి బాపట్ల వెళ్లేందుకు బాపట్ల-చీరాల ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు సంచరిస్తుంటాయి. దీనికి తోడు చేపల క్రయ విక్రయాలతో జనం ఎప్పుడు రద్దీగా ఉంటారు. పెద్ద మార్కెట్లో దొరకని చేపలు కూడా ఇక్కడ వ్యాపారుల వద్ద దొరుకుతాయి. అందువలన నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడగే కాకుండా జనాలకు కూడా తిప్పలు తప్పడంలేదు. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా నిరుపయోగంగా మారిన మార్కెట్లో కొందరు అశ్లీల కార్యకలాపాలకు, మందుబాబులు, పశువుల కాపరులు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీసులు స్పందించి వ్యాపారులకు అవగాహన కల్పించి క్రయ, విక్రయాలను మార్కెట్లోకి తరలించే ఏర్పాటుచేసి స్థానికులు, వాహనదారుల కష్టాలను కడతేర్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ఇళ్ల ముందు విక్రయాలు వద్దని చెప్పాం..



ఇళ్ల ముందు చేపలు విక్రయాలు చేపట్టవద్దని వ్యాపారులకు అనేక సార్లు చెప్పాం. మసీదు వారితో కలసి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు కూడా ఇచ్చాం. అయినప్పటికీ వ్యాపారులలో ఎటువంటి కదలికలేదు. చేపల విక్రయాలతో వచ్చే వాసనతో ఇళ్లల్లో ఉండలే కపోతున్నాం. నమాజు చేసుకునేందుకు మసీదుకు వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – షేక్ బాజి, స్థానికుడు

మార్కెట్లో వ్యాపారాలు సాగడంలేదు..



మున్సిపాలిటీ నిర్మించిన మార్కెట్లోకి జనాలు రావడంలేదు. అందువలన మా వ్యాపారాలు సాగడంలేదు. అప్పోసొప్పో చేసి తెచ్చుకున్న పచ్చి సరుకు (చేపలు) పాడైపోతున్నాయి. దానివలన నష్టాలు వస్తున్నాయి. చేసేదిలేక రోడ్డుపైనే మా వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– రత్తమ్మ, చేపల వ్యాపారి

వ్యాపారులను మార్కెట్లోకి తరలిస్తాం..

రోడ్లపై వ్యాపారాల వలన వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవమే. రోడ్లపై వ్యాపారాలు చేస్తు ట్రాఫిక్‌కు, జనావాసాలకు ఇబ్బందులు కలుగజేస్తున్న వ్యాపారులకు అవగాహన కల్పించి జక్కావారివీధిలో ఏర్పాటు చేసిన మున్సిపల్ మార్కెట్‌కు తరలిస్తాం. కొద్ది రోజుల్లోనే వ్యాపారులందరిని మార్కెట్‌కు తరలిస్తాం.

– అబ్దుల్ రషీద్, మున్సిపల్ కమిషనర్, చీరాల

డిసెంబర్ 2 నుంచి 13 వరకు వేట నిషేధం



మత్స్యకారులకు సూచనలందిస్తున్న డార్విన్

చీరాల టౌన్: సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి డిశంబర్ 2నుంచి భారత వైమానిక దళం మిస్సైల్ ఫైరింగ్ చేస్తున్నారని వాడరేవు ప్రాంత మత్స్యకారులు డిసెంబర్ 2 నుంచి 13 వరకు సముద్రంలో పూర్తిగా వేట నిలుపుదల చేయాలని వాడరేవు మత్స్య సహాయకులు డార్విన్ సూచించారు. శుక్రవారం వాడరేవు సచివాలయంలో గ్రామంలోని మత్స్యకార సొసైటీల పెద్దలు, మత్స్యకారులతో వేట నిలుపుదలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డార్విన్ మాట్లాడుతూ.. భారత వైమానిక దళం ప్రతీ ఏటా మిస్సైల్ ఫైరింగ్‌ను సముద్రంలో నిర్వహిస్తుంటారని ఈ ఫైరింగ్ సమయంలో మత్స్యకారులు వేట నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళీతో పాటుగా వైమానికదళ వింగ్ కమాండర్‌లు ఆదేశాలు జారీ చేశారన్నారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి జరిగే మిస్సైల్ ఫైరింగ్ 150 కిలో మీటర్ల మేరకు జరుగుతుందని మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండి 13 తేదీ వరకు వేట నిలుపుదల చేసి సహకరించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలను విస్మరించి ఎవరైనా వేట చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మత్స్యకార సొసైటీల అధ్యక్షులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చట్టరీత్యా నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మోయిన్

చీరాల: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపించటం చట్టరీత్యా నేరమని.. వారికి హక్కులు ఉన్నాయని డీఎస్పీ ఎండీ మోయిన్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా ఇంటిగ్రేటెడ్ ప్రివెన్షన్ స్ట్రాటజీ బాపట్ల జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సమీకృత వ్యూహం, మహిళా మండలి చీరాల హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షతన చీరాల మహిళా మండలి సమావేశ హాలులో పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపించి వారిని అంటరానివారిగా చూస్తే వారు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. చట్ట ప్రకారం ఆమోదించబడిన హక్కులు కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారి చట్టాలను ఉల్లఘించినట్లు అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, న్యాయవాది ఆర్ వెంకటేశ్వరరెడ్డి, హెల్ప్ ఎంఈటి అనిల్‌కుమార్, చీరాల మహిళామండలి ప్రొగ్రాం మేనేజర్ కె.వెంకట్రావు, మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులతో ఉపయోగాలు



ఆధార్ క్యాంపు పరిశీలిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో కుసుమ కుమారి కోరారు. శుక్రవారం ఉప్పుమాగులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపును ఆమె పరిశీలించారు. ఆధార్‌కార్డు లేని చిన్న పిల్లలు ఈ క్యాంపులో కొత్తకార్డులు తీసుకోవచ్చని, తప్పులు ఉన్నవారు సరైన ఆధారాలతో సరిచేయించు కోవచ్చన్నారు. డిసెంబర్ నెలకు సంబంధించి శనివారమే పింఛన్ పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులు ఇళ్ల వద్దనే ఉంటూ పింఛన్ తీసుకోవాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అధికార పక్షం వర్సెస్ ప్రతిపక్షం



సమావేశంలో వాదోపవాదనలు చేసుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు

- వాదోపవాదాల మధ్య మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- 18 అంశాలలో 14 అంశాలకు ఆమోదం, నాలుగు వాయిదా

చీరాల: చీరాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అధికార పక్షం వర్సెస్ ప్రతి పక్షం అన్నట్లు వాదోపవాదాల నడుమ కౌన్సిల్ సమావేశం జరిగింది. శుక్రవారం స్థానిక కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలపై చర్చ జరగగా అధికార పార్టీ, ప్రతిపక్ష కౌన్సిలర్ల వాదోపవాదనలు జరిగాయి. అజెండాలోని 15వ అంశంపై 29వ వార్డు కౌన్సిలర్ అనిల్‌కు, అధికార పార్టీ కౌన్సిలర్ ఎస్.సత్యానందం మధ్య వాదనలు జరిగాయి. తన వార్డులో 13 అడుగుల సీసీ రోడ్డు నిర్మాణం ఉంటే అదే రోడ్డుకు డ్రైనేజీ నిర్మాణం ఏ విధంగా చేపడతారని ప్రశ్నించారు. అర అడుగు వెడల్పులో మురుగునీటి కాలువ ఏ విధంగా నిర్మిస్తారన్నారు. దీంతో కౌన్సిలర్ సత్యానందం మరోలా వాదనకు దిగారు. దీంతో సభ కొంత సమయం గందరగోళం నెలకొంది. అలానే పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు మాజీ మంత్రి పాలేటి రామారావు ఇచ్చిన వినతిపత్రం అజెండాలో పొందుపరచకపోవడంతో కౌన్సిలర్ల మధ్య రసాభాస జరిగింది. దీంతో కమిషనర్ అబ్దుల్ రషీద్ జోక్యం చేసుకుని అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విగ్రహ ఏర్పాటుపై స్థలాలను పరిశీలన చేస్తామని చెప్పడంతో వాదనలు సద్దుమనిగింది. అనంతరం 14వ ఆర్థిక సంఘం నిధుల పనుల కేటాయింపు, నీటి పన్నుల పెంపు అంశాలపై వాదనలతో కూడిన చర్చ సాగింది. నీటి పన్నులు ఎట్టి పరిస్థితుల్లో పెంచడానికి వీలులేదని కౌన్సిలర్లు పట్టు పట్టారు. దీంతో నీటి పన్నులు యథావిధిగా ఉండాలంటూ తీర్మానించి అంశాన్ని ఆమోదించారు. అలానే పలు అంశాలపై చర్చ జరగగా 18 అంశాలలో నాలుగు అంశాలు వాయిదా పడగా 14 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం



ఎంపీడీఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: మన మరుగుదొడ్డి-మన ఆత్మగౌరవం అని ఎంపీడీఓ స్వరూప రాణి అన్నారు. మండల పరిధిలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పంగులూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి ప్రతి ఇంటికి మరుగు దొడ్డి తప్పనిసరన్నారు. లేని వారు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాంగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ

ఇంకొల్లు (చినగంజాం): పేద విద్యార్థినికి స్వచ్ఛంద సేవా సంస్థ ల్యాప్‌టాప్ అందించింది. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం వెనిగండ్ల గ్రామంలోని పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేశారు. గ్రామంలోని వేమన జెడ్పీ ఉన్నత పాఠశాల నందు పూర్వ విద్యార్థి అయిన ఇంజినీరింగ్ చదువుతున్న ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని వజ్రాల తనుశ్రీకి కొమ్మాలపాటి హరి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం సుధీర్ కుమార్, హరీష్‌బాబుల సౌజన్యంతో ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి లిడ్‌క్యాప్ చైర్మన్ పీ మాణిక్యారావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

108లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తులు

చీరాల రూరల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ (ఈఎంటి) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా మేనేజర్ పి. శివరాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ.ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసిన ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబర్ రెండో తేది సాయంత్రంలోగా చీరాల ప్రభుత్వాసుపత్రిలోని రూం నంబర్ 25లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 88851 07040 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



గుంటుపల్లి శివాలయంలో లక్ష బిల్వార్చన



దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానం, లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్కవరం స్వామిజీ హాజరై దీపోత్సవాన్ని ప్రారంభించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన దీపాలను భక్తులు వెలిగించారు. దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఏర్పాటు పర్యవేక్షించి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బల్లికురవ: గుంటుపల్లి గ్రామంలోని గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు జీ. పవన్‌కుమార్ శర్మచే శివునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేపట్టారు. కొణిదెన గ్రామంలోని బ్రహ్మకుండం దిగువ భాగంలోని గంగాపార్వతి దేవి సహిత నాగలింగేశ్వరస్వామికి రుద్రాభిషేం ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం



నగదు అందజేస్తున్న వాకర్స్ సభ్యుడు వీరాంజనేయులు

చీరాల రూరల్: వాకర్స్ సేవాకార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఎన్ఆర్‌అండ్‌పిఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైస్కూలు క్రీడా మైదానంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాత వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అమరా వీరాంజనేయులు ప్రభుత్వాసుపత్రిలో మధ్యాహ్న భోజన పథకానికి సంభందించి రూ. 4,000, అలానే శ్రీకృష్ణ గోశాలలోని ఆవుల ఆహార నిమిత్తం రూ. 2,500, అనాధ వృద్ధాశ్రమాలకు రూ. 3 వేల విలువ గల నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, వాకర్స్ సభ్యులు అమరా వీరాంజనేయులు, గురుప్రసాద్, మధుసూదనరావు, తిరుపతిరావు, నారాయణమూర్తి, చెన్ననారాయణ పాల్గొన్నారు.

వరికి ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్

- తుఫాన్ హెచ్చరికలతో భయాందోళనలో అన్నదాతలు
- కళకళలాడుతున్న వరి పైర్లు

కారంచేడు: రబీ సీజన్‌లో అయినా ఎంతోకొంత పండించుకుందాం అనుకొనేసరికి తుఫాన్ రైతులను భయపెట్టిస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడులో వ్యవసాయ భూములు పచ్చగా కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం కొమ్మమూరు ఆయకట్టు కింద వరి సాగుకు వాతావరణం పూర్తిగా అనుకూలించింది. సకాలంలో వర్షాలు కురిశాయి. సాగుకు అనుకూలించడంతో అన్నదాతలు ఆనందంగా సాగు మొదలుపెట్టారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో పాటు ఈ ప్రాంత ప్రధాన నీటి వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువకు సకాలంలో నీరు చేరింది. దీంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముమ్మరంగా వరి నాట్లు సాగు చేస్తున్నారు. అయితే గ్రామానికి ఉత్తరం, దక్షిణ ప్రాంతాల్లో ఉన్న చేలకు మాత్రం సాగు నీరు కొంత నామమాత్రంగానే అందుతున్నాయని రైతులు చెప్తున్నారు. కారణమేమంటే ఈ ప్రాంత పొలాలకు సాగు నీరు కాలువ ద్వార రావు. వర్షాలు బాగా కురిసి పంట కాలువలకు నీరు చేరితేనే వీటికి నీరు అందుతుంది. కొమ్మమూరు కాలువ నుండి ఇంజన్‌ల ద్వార నీటిని పంపింగ్ చెయ్యాలన్నా వ్యవప్రయాసలతో కూడిన పనిగానే రైతులు చెప్తున్నారు. మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల పరిధిలో ఖరీఫ్ సాగులో సుమారు 10 వేల ఎకరాల్లో వరిసాగుకు అన్నదాతలు తమ పనులు ప్రారంభించారు. కొమ్మమూరు ఆయకట్టు కింద చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో ఈ వరి చేలలో సాగుకు అన్నదాతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం మళ్లీ పచ్చని తోరణాలు పరిచినట్లు వరి చేలు కళకళలాడుతున్నాయి. స్వర్ణ దండుబాట రోడ్డులో కొంత మంది రైతులు నార్లు పోసుకుంటుంటే మరి కొంత మంది నాట్లు వేస్తున్నారు. కొంత మంది నాట్ల కోసం చేలల్లో దమ్ములు చేసుకుంటున్నారు. వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో ప్రస్తుతం వరి చేలు చూడ ముచ్చటి పరిసరాలతో కారంచేడు ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు ఆగి మరీ ఫోటోలు దిగుతున్నారు. మరికొంత మంది సెల్ఫీలతో సంతోషంగా పచ్చని చేలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.



చీరాల-కారంచేడు రోడ్డులో మంచులో ఆహ్లాదకరంగా ఉన్న వరిచేలు

తుఫాను హెచ్చరికలతో ఆందోళనలో అన్నదాతలు..

వాతావరణశాఖ ప్రకటించిన ఫెంగల్ తుఫాను ఈ నెల 28 తేదీ నుంచి డిసెంబర్ 3వతేదీ వరకు ఈ ప్రాంతంలో అధిక వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో అన్నదాతలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. గత ఏడాది కూడా డిసెంబర్‌లో వచ్చిన తుఫాను కారణంగా ఎగువ ప్రాంతాలైన సంతమాగులూరు, చిలకలూరిపేట, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి వచ్చే వరదలతో చివరి భూములుగా ఉన్న కారంచేడు ప్రాంత వరిచేలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ఇందుకు పాలకుల నిర్లక్ష్యమేనని అన్నదాతలు వాపోతున్నారు. గత 13,14 సంవత్సరాలుగా వరదలు ప్రవహించేందుకు ఉన్న రొంపేరు కాలువల్లో పూడికలు తీయకపోవడం వలన ఈ వరదలు ముంచెత్తుతున్నాయని రైతులు ఆందోళన పడుతున్నారు. ప్రస్తుతం కొమ్మమూరు ఆయకట్టులోని కారంచేడు ప్రాంత భూముల్లోని వరి చేలు చిగురు దశలో ఉన్నాయని, ఈ తరుణంలో వచ్చే వరదలతో చేలు మునిగితే అవి కుళ్లిపోయి, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.